AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## దసరాకు 388 ప్రత్యేక బస్సులు

**అక్షరటుడే, ఇందూరు :** దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జ్యోత్స్న తెలిపారు. ప్రధానంగా నిజామాబాద్ రీజియన్ నుంచి సికింద్రాబాద్, అలాగే తిరుగు ప్రయాణానికి అదనపు బస్సులు వేశామన్నారు. ఈనెల 26న 50, 27న 80 బస్సులు, 28న 68 బస్సులు, 29 నుంచి ఒకటో తేదీ వరకు 50 చొప్పున బస్సులను సికింద్రాబాద్‌కు, అలాగే ఇతర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. రీజియన్ పరిధిలో ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా జేబీఎస్ బస్టాండ్‌లో డిపోల వారీగా ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. ప్రయాణికులు ముందస్తుగా రిజర్వేషన్ చేసుకోవడం ద్వారా సౌకర్యవంతమైన, ఇబ్బందులు లేకుండా ప్రయాణించవచ్చన్నారు. టికెట్ బుకింగ్ కోసం tgsrtcbus.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.



## కమిషనరేట్ పరిధిలో ఎస్సైల బదిలీ




**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో ఎస్సైల బదిలీలు జరిగాయి. ఈ మేరకు సీపీ సాయిచైతన్య శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం తొమ్మిది మందిని ట్రాన్స్‌ఫర్ చేశారు. ఇందులో భాగంగా.. టి.గోవింద్‌ను ఆర్మూర్ నుంచి సీసీఎస్ నిజామాబాద్‌కు పంపించారు. సిలివేరి మహేష్‌ను నిజామాబాద్ నాల్గో టౌన్ నుంచి సీసీఎస్ నిజామాబాద్‌కు బదిలీ చేశారు. గంగుల మహేష్‌ను వీఆర్ నుంచి సీసీఎస్ నిజామాబాద్‌కు అటాచ్ చేశారు. గురుక మహేష్‌ను వీఆర్ నుంచి ఒకటో టౌన్ పీఎస్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. సామ శ్రీనివాస్‌ను సౌత్ రూరల్ నుంచి నిజామాబాద్ రూరల్ ఎస్సై-2గా బదిలీ చేశారు. మొగులయ్యను ఒకటో టౌన్ నుంచి మాక్లూర్ పీఎస్ రెండో ఎస్సై-2గా పంపించారు. వీఆర్‌లో ఉన్న కె.వినయ్‌కుమార్‌ను ఆర్మూర్ పీఎస్‌కు బదిలీ చేశారు. సాయన్ గౌడ్‌ను వీఆర్ నుంచి సీఎస్‌బీ నిజామాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. వీఆర్‌లో ఉన్న బీబీఎస్ రాజును కలెక్టరేట్‌కు అటాచ్ చేశారు. బదిలీ అయిన వారు వెంటనే తమకు కేటాయించిన స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని సీపీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.












## దసరా సెలవుల్లో చ్చాయోచ్..

రాష్ట్రవ్యాప్తంగా దసరా పండుగ సందర్భంగా పాఠశాలలకు విద్యాశాఖ సెలవులు ప్రకటించింది. ఈనెల 21వ తేదీ నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు సెలవులు ఇచ్చింది. దీంతో ఆయా పాఠశాలల్లోని హాస్టళ్లలో ఉండే విద్యార్థులు ఇంటిబాట పట్టారు. ఈ సందర్భంగా నిజామాబాద్, బోధన్ బస్టాండ్లు కిక్కిరిసిపోయాయి. విద్యార్థులు వారికి తోడుగా వచ్చిన తల్లిదండ్రులతో కలిసి ఇళ్లకు వెళ్తుండడంతో బస్సులన్నీ కిటకిటలాడాయి.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్/ బోధన్

## శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

**అక్షరటుడే, మెండోరా :** శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో అధికారులు వరద గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలోకి శుక్రవారం 3,68,226 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. శనివారం తగ్గింది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లోకి 2,13,285 క్యూసెక్కుల వరద వస్తోంది. అధికారులు 39 గేట్లు ఎత్తి 1,97,010 క్యూసెక్కులు గోదావరి లోకి విడుదల చేస్తున్నారు. జలాశయం సామర్థ్యం 80.5 (1091 అడుగులు) టీఎంసీలు కాగా.. ప్రస్తుతం అంతేమొత్తం నీరు నిల్వ ఉంది. వరద గేట్లు, కాల్వల ద్వారా మొత్తం 2,13,285 క్యూసెక్కుల ఔట్ ఫ్లో కొనసాగుతోంది.




## బడుల్లో బతుకమ్మ సంబరాలు

తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే పండుగ బతుకమ్మ వేడుకలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. కాగా.. విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో బడుల్లో ముందుస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్లు, విద్యార్థులు స్కూళ్లలో బతుకమ్మ ఆడారు. అనంతరం స్థానిక చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. – అక్షరటుడే, నెట్‌వర్క్

–మిగతా చిత్రాలు 2లో..



## స్టడీ హబ్‌గా మార్చడానికి కృషి చేస్తా: షబ్బీర్ అలీ

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డిని స్టడీ హబ్‌గా మార్చడానికి తనవంతు కృషి చేస్తానని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. ఆర్కే విద్యాసంస్థల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని శనివారం దేవునిపల్లి లక్ష్మీదేవి గార్డెన్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న షబ్బీర్ అలీ గ్రాడ్యుయేషన్ పూర్తయిన విద్యార్థులకు పట్టాలు అందించారు. వివిధ గ్రూపుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి నగదు పారితోషికం అందజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన వద్ద ఉంచుకొని పర్యవేక్షిస్తున్నారన్నారు. గత పదేళ్లలో విద్యావ్యవస్థ భ్రష్టు పట్టిపోయిందన్నారు. స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ లేదని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో రూ.3,500 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి పెట్టారని, కాంగ్రెస్ ప్రభుత్వం విడుతల వారీగా విడుదల చేస్తూ విద్యావ్యవస్థపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని చెప్పారు. దేశంలోనే ఎక్కడలేని విధంగా తెలంగాణలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తున్నామన్నారు. 25 ఎకరాల్లో నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ విద్యాలయం నిర్మిస్తున్నామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు 60వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. కామారెడ్డి జిల్లా విద్యార్థులు ఐపీఎస్, ఐఏఎస్ లాంటి ఉద్యోగాలు సాధించడంతో పాటు ఉన్నత స్థానాలకు ఎదిగి కామారెడ్డి పేరును నిలబెట్టాలన్నారు.



## దేవీమాత మండపాలకు పట్టుచీరల పంపిణీ

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని పలు దేవీమాత మండపాలకు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పట్టుచీరలను పంపిణీ చేశారు. మార్వాడీగల్లీలోని తన కార్యాలయంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదకొండేళ్ల నుంచి ధన్‌పాల్ లక్ష్మీబాయి, విఠల్‌గుప్తా ట్రస్ట్ ఆధ్వర్యంలో హిందూ పండుగలకు సహాయసహకారాలు అందజేస్తున్నానన్నారు. హిందూ ధర్మరంలో శరన్నవరాత్రులకు ప్రాముఖ్యత ఉందని ధన్‌పాల్ అన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా పండుగ జరుపుకుంటారని వివరించారు. దుర్గాదేవి మహిషాసురుడనే రాక్షసుడితో తొమ్మిది రాత్రులు యుద్ధం చేసి అతడిని వధించిన సందర్భంగా విజయదశమి జరుపుకుంటారన్నారు. కార్యక్రమంలో ఏసీపీ రాజా వెంకటరెడ్డి, ట్రస్ట్ సభ్యులు ఉదయ్ కుమార్, ప్రణయ్ కుమార్, బీజేపీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## రహదారుల విస్తరణకు భూసేకరణ

**అక్షరటుడే, ఇందూరు:** జాతీయ రహదారుల విస్తరణ పనుల కోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు. జిల్లాల కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. ఇప్పటికే పరిహారం చెల్లింపు పూర్తయిన భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. అభ్యంతరాలు ఉన్న వారితో మాట్లాడి సహకరించేలా చూడాలన్నారు. భూసేకరణ విషయంలో నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కరించి, జాతీయ రహదారి సంస్థకు భూములు అప్పజెప్పాలని చెప్పారు. భూ సేకరణ కోసం అవసరమైన నిధులు సిద్ధంగా ఉన్నాయని, పనులు చేపట్టేందుకు కాంట్రాక్ట్ ఏజెన్సీలు కూడా సమాయత్తమై ఉన్నందున యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఆయా సెక్షన్ల పరిధిలో ఎంత పని పూర్తయింది, ఇంకా ఎంత మిగిలి ఉంది, పెండింగ్ పనులు తదితర వివరాలను తెలుసుకున్నారు. అటవీ భూముల సేకరణకు సత్వర అనుమతుల విషయంలో ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ పనుల కోసం జిల్లాలో ఇప్పటికే 74 హెక్టార్ల భూమికి సంబంధించి ప్రక్రియ పూర్తయిందన్నారు. కోర్టు స్టే కారణంగా మరో 19 హెక్టార్ల భూసేకరణ ప్రక్రియ నిలిచిపోయిందని చెప్పారు. ఇటీవలే కోర్టు స్టే తొలగినందున సత్వరమే పూర్తి చేస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఎఫ్‌వో వికాస్ మీనా, బోధన్, ఆర్మూర్ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్మావి, ఆర్డీవో రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రంథాలయ భవన నిర్మాణానికి కృషి చేస్తా

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థకు సంబంధించి నూతన భవన నిర్మాణం కోసం అన్ని విధాలా కృషి చేస్తానని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ హామీ ఇచ్చారు. నగరంలోని గ్రంథాలయం భవన నిర్మాణ స్థలాన్ని శనివారం పీసీసీ చీఫ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణానికి అన్ని విధాలా కృషి చేస్తామన్నారు. గ్రంథాలయానికి వచ్చి కాంపిటేటివ్ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు అన్నివిధాలా ఉపయోగపడేలా భవనం నిర్మిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి మాట్లాడుతూ పాత డీఈవో కార్యాలయం ఖాళీ స్థలంలో అన్ని హంగులతో అధునాతన భవనం నిర్మించాలని కోరారు. పాత డీఈఓ కార్యాలయ భవనం జిల్లా కేంద్రం నడిబొడ్డున ఉన్నందున అందరికీ అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరాల రత్నాకర్, నగేష్ రెడ్డి, శేఖర్ గౌడ్, విపుల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



### నిత్యాన్నదానాన్ని ప్రారంభించిన టీపీసీసీ చీఫ్

అన్నిదానాల్లో అన్నదానం గొప్పదని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. శనివారం ఉత్తర తిరుపతి క్షేత్రంలో ఎస్‌జీఎస్ పద్మావతి నిత్య అన్నదాన ఇందూరు ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదలకు నిత్యాన్నదానం చేయడం అభినందనీయమని, ట్రస్ట్‌కు తనవంతుగా రూ.1,01,116 విరాళం అందించినట్లు పేర్కొన్నారు. సేవా దృక్పథంతో అన్నదానం చేయడంపై నిర్వాహకులను ప్రశంసించారు. అలాగే ఆలయంలో జరుగుతున్న అన్నదాన సేవలు, ఆలయ అభివృద్ధి, తదితర అంశాలపై స్థానిక ఎమ్మెల్యేతో చర్చిస్తానని, అవసరమైతే సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ రాం భూపాల్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### జర్నలిస్ట్ నారాయణ కుటుంబానికి పీసీసీ చీఫ్ పరామర్శ

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్ లక్కవత్రి నారాయణ కుటుంబాన్ని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ పరామర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన మిట్టపల్లిలోని నారాయణ ఇంటికి వెళ్లారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తానని భరోసా కల్పించారు. అనంతరం రూ. లక్ష ఆర్థిక సాయం ప్రకటించారు. ఆయన వెంట మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కాటిపల్లి నగేష్ రెడ్డి, మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, శేఖర్ గౌడ్, పొలసాని శ్రీనివాస్, గడీల శ్రీరాములు, రామచందర్ గౌడ్, ముల్లంగి నర్సయ్య, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## లింబాద్రి గుట్టపై సీపీ పూజలు

**అక్షకటుడే, భీమ్‌గల్:** లింబాద్రి గుట్టపై బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం సీపీ సాయిచైతన్య లక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులతో మాట్లాడి ఆలయ వివరాలను తెలుసుకున్నారు. అనంతరం పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. లింబాద్రి గుట్ట జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తు రాకపోకలు సాఫీగా సాగేందుకు ట్రాఫిక్ డైవర్షన్ ప్లాన్ చేయాలన్నారు. పార్కింగ్ ప్రాంతాలను ముందుగానే ప్లాన్ చేయాలన్నారు. జాతర విజయవంతంగా శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీసులు, రెవెన్యూ, దేవాదాయ, స్థానిక సంస్థల అధికారులతో సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. సీపీ వెంట భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ, ఎస్సై సందీప్, ఆలయ ప్రధాన అర్చకులు తదితరులున్నారు.






## సీసీఎస్ సేవలు అభినందనీయం: ఎస్పీ

**అక్షరటుడే, కామారెడ్డి :** పోలీస్‌శాఖలో సీసీఎస్ సేవలు అభినందనీయమని ఎస్పీ రాజేష్ చంద్ర పేర్కొన్నారు. సీసీఎస్ ద్వారా ఇప్పటివరకు 10 అంతర్రాష్ట్ర ముఠాలను పట్టుకున్నామని చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఛేస్ క్యాచ్ సాల్వ్ అనే కొత్త స్లోగన్‌తో కూడిన సీసీఎస్ క్యాప్షన్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో ఈ ఏడాది ఆస్తి సంబంధిత దొంగతనాల కేసుల్లో 46 శాతం ఛేదించి 42 శాతం సొత్తు రికవరీ చేసి బాధితులకు అందజేయడం జరిగిందన్నారు. దొంగతనాల నివారణకు ప్రతిరోజూ నాకా బందీ, పెట్రోలింగ్, బీట్ డ్యూటీలు పెంచి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. నేరస్థులు ఏమూలన దాగి ఉన్నా వారిని వెంబడించి, పట్టుకొని, కేసులు పరిష్కరించే విధంగా సీసీఎస్ సంసిద్ధమై ఉంటుందన్ని స్పష్టం చేశారు. సీసీఎస్ ద్వారా 10 అంతర్రాష్ట్ర ముఠాలను పట్టుకోవడం జరిగిందని, అందులో మహారాష్ట్ర4, మధ్యప్రదేశ్ 3, ఢిల్లీ, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఒక్కో గ్యాంగ్‌లు ఉన్నాయన్నారు. నేరాల పరిష్కారంలో సీసీఎస్ అత్యంత చాకచక్యంగా విధులు నిర్వహిస్తోందన్నారు. నేరాల నివారణలో ప్రజల వైపు నుండి సహకారం అవసరమని పేర్కొన్నారు. జిల్లా పోలీస్ వ్యవస్థ క్రమశిక్షణ, నిబద్ధతతో ప్రజలకు సేవలు అందించడంలో ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. అనంతరం బాధ్యతాయుతంగా, చాకచక్యంగా విధులు నిర్వర్తించి 46శాతం నేరాలను ఛేదించి 42శాతం సొత్తు రికవరీ చేసినందుకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సై ఉస్మాన్ సిబ్బందిని ఎస్పీ అభినందిస్తూ నగదు రివార్డులను అందజేశారు. కార్యక్రమంలో కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు, బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి, ఎస్‌బీ సీఐ శ్రీధర్ పాల్గొన్నారు.



## జీపీని ముట్టడించిన పింఛన్‌దారులు

**అక్షరటుడే, బోధన్:** పింఛన్ పెంచి ఇవ్వాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఈమేరకు వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఎడపల్లి పంచాయతీ కార్యాలయాన్ని శనివారం పింఛన్‌దారులు ముట్టడించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ మాట్లాడుతూ.. వికలాంగులకు రూ. 6వేలు, వృద్ధులు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, నేత, గీత, బీడీ కార్మికులకు రూ. 4వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే కండరాల క్షీణత ఉన్నవారికి రూ.15వేలు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పింఛన్లు పెంచి ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని సుజాత సూర్యవంశీ గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీని విస్మరించారన్నారు. పింఛన్లు పెంచి ఇస్తారని లబ్ధిదారులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూమయ్య, ఎంఎంఎస్ జిల్లా సీనియర్ నాయకురాలు సావిత్రి, ఆఫీజ, బాలమణి, స్వర్ణలత, హైమదీ, సునీత, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

### ఎల్లారెడ్డి మండల కేంద్రంలో..



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండల కేంద్రంలో గ్రామ పంచాయతీని ఎమ్మార్పీఎస్ నాయకులు ముట్టడించారు. ఈ సందర్భంగా జీపీ సిబ్బందికి శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్నికల హామీలో భాగంగా పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తట్లేదన్నారు. ఎట్టిపరిస్థితుల్లో పింఛన్లను పెంచి ఇవ్వాలని.. లేకపోతే అక్టోబర్‌లో పింఛన్‌దారులమంతా కలిసి హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కంతి పద్మారావు, శివానంద, సౌందర్య, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.



## సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే సబ్సిడీ

**అక్షరటుడే, ఇందూరు:** ఇంటిపై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని ఎస్ఈ రవీందర్ తెలిపారు. సోలార్ పవర్‌పై పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసిం ది. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఎస్ఈ మాట్లాడుతూ.. సోలార్ ప్యానల్స్‌తో విద్యుత్ ఉత్పత్తి చేస్తే ఒక కిలో వాట్‌కు 85కిలోల కార్బన్ మోనాక్సైడ్ వాతావరణంలోకి వెలువడకుండా నిరోధించిన వాళ్లమవుతామన్నారు. ఒక కిలో వాట్ సోలార్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.30 వేలు, మూడు కిలో వాట్ ఆపైన వినియోగిస్తే రూ.78వేల సబ్సిడీ అందిస్తుందన్నారు. డిస్కం ఇంజినీర్లు పట్టణాలు, గ్రామాల్లో పీఎం సూర్య ఘర్ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన ఇంజినీర్లకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ భారతి, విశ్రాంత చీఫ్ ఇంజినీర్ దుర్గాప్రసాద్, నరేంద్ర కుమార్, డీఈ టెక్నికల్ రమేష్ అధికారులు పాల్గొన్నారు.



## పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులు దూరం

**అక్షరటుడే, ఇందూరు:** వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులు వ్యాపించవని నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ అన్నారు. నగరంలోని ఐటీఐ మైదానంలో వాకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ ఇంటి వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. వ్యర్థాల వల్ల కలిగే నష్టాలపై వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తమ కాలనీల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రవిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు వాకింగ్ అసోసియేషన్ ప్రతినిధులు పృథ్వీరాజ్, మోహన్, మురళి, లక్ష్మణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ ట్యాంకర్ ఢీకొని యువకుడి మృతి

**అక్షరటుడే, బోధన్ :** వాటర్ ట్యాంకర్ ఢీకొని హైదరాబాద్‌లో బోధన్ వాసి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. సాలూర మండలం హున్సాకు చెందిన నందకుమార్(21) హైదరాబాద్‌లో పనిచేస్తున్నాడు. అయితే శనివారం నగరంలోని పటాన్‌చెరు మీదుగా విధులకు వెళ్తుండగా.. వాటర్ ట్యాంక్ ఢీకొట్టింది. దీంతో అయన అక్కడికక్కడే మృతిచెందాడు. నందకుమార్ తండ్రి ఏడాది క్రితమే మరణించాడు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బోధన్‌లోని ఆయన కుటుంబీకులు, బంధువుల హైదరాబాద్ వెళ్లారు.

జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్దఎత్తున ఆస్తి నష్టంతో పాటు పంట నష్టం వాటిల్లింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు అండగా ఉంటామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో పంటనష్టంపై అంచనా వేయాలని ఆదేశించారు. దీంతో వ్యవసాయాధికారులు పంటనష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిసింది. మరోవైపు రైతులు పరిహారంపై ప్రభుత్వం నుంచి ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.

- అక్షరటుడే, ఇందల్వాయి



# పరిహారం అందేనా..!

- భారీ వర్షాలకు జిల్లాలో భారీగా పంటనష్టం
- పరిహారం కోసం రైతుల ఎదురుచూపు

జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులు పంటనష్టంపై సర్వే చేపట్టారు. మొత్తం 5.2 లక్షల ఎకరాల్లో పంటలు సాగవగా, ప్రధానంగా వరి 4.30 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 52వేల ఎకరాలు, సోయాబీన్ 336 ఎకరాల్లో సాగయినట్లు పేర్కొన్నారు. అయితే, భారీ వర్షాలకు 19వేల ఎకరాల్లో 30 శాతానికిపైగా పంటనష్టం వాటిల్లినట్లు వ్యవసాయక శాఖ అధికారులు అంచనా వేశారు.

ఎక్కువగా బోధన్ నియోజకవర్గంలోని రెంజల్, సాలూరా, బోధన్, నవీపేట్ మండలాల్లో పంట నష్టం జరుగగా, అధికంగా వరి, సోయా పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### కోతలకు వేళాయె.. పాత బోనస్ రాకపాయె..

అక్టోబర్ నెలాఖరు నుంచి ధాన్యం సేకరణ చేపడతామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటుండగా, జిల్లాలో ముందుగా నాట్లు వేసిన రైతుల పొలాలు మరో వారం, పదిరోజుల్లో కోతకు రానున్నాయి. ఈ క్రమంలో పాత సీజన్‌కు చెందిన బోనస్ బకాయిలు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కోతలు ప్రారంభం కావస్తుండగా గత సీజన్ బోనస్ డబ్బులు రాలేదని చర్చించుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సేకరిస్తున్న సన్నధాన్యానికి సంబంధించి బోనస్ డబ్బులు విడుదల ఆలస్యం చేస్తుండడంతో రైతులకు నిరీక్షణ తప్పడం లేదు.

### పంటనష్టం నివేదిక ప్రభుత్వానికి అందించాం



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో పంటనష్టం వివరాలను సేకరించాం. ఈ మేరకు నివేదికను ప్రభుత్వానికి సమర్పించాం. జిల్లాలో అత్యధికంగా బోధన్ నియోజకవర్గంలోని రెంజల్, సాలూర, నవీపేట్, బోధన్ మండలాల్లో పంట నష్టం జరిగింది.

– గోవింద్, జిల్లా వ్యవసాయ అధికారి

### రైతులకు తక్షణ సాయం అందించాలి



ఇటీవల కురిసిన వర్షాల మూడు ఎకరాల వరి, రెండు ఎకరాల్లో మొక్కజొన్న సోయాబీన్‌కు నష్టం వాటిల్లింది. భారీవర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే తక్షణ సాయం కింద ఎకరానికి రూ.30,000 అందించి ఆదుకోవాలి. బోనస్ డబ్బులు కూడా విడుదల చేయాలి. – భూషణ్ రెడ్డి, రైతు. గడ్కోల్

### నష్టపరిహారం అందించి ఆదుకోవాలి



ఇటీవల కురిసిన భారీ వర్షంతో పెద్ద ఎత్తున వరద వచ్చి ఎకరంన్నర వరిపొలంలో ఇసుక మేట వేసింది. ప్రభుత్వం పంట నష్టాన్ని అందించి రైతులను ఆదుకోవాలి. వచ్చే సీజన్‌లో పంట వేసేందుకు అవకాశం లేదు. ప్రభుత్వం స్పందించాలి.

– అరటి రఘు, రైతు. చంద్రాయన్ పల్లి


## 27న మార్కెట్ యార్డు కార్మికుల రాష్ట్ర మహాసభ




**అక్షరటుడే, ఇందూరు :** వ్యవసాయ మార్కెట్ యార్డు హమాలీ, దడ్వాయి, గుమస్తా, స్వీపర్ వర్కర్స్ రాష్ట్ర మహాసభ ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర రెండో మహాసభ నిజామాబాద్ మార్కెట్ యార్డులోని ఉమామహేశ్వర ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహాసభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ ముప్పగంగారెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, తదితరులు హాజరవుతారని చెప్పారు. ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవలంభిస్తున్న విధానాలు, కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్తులో మార్కెట్ యార్డుల అభివృద్ధికి తీసుకునే కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చ ఉంటుందన్నారు. కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు, ఉపాధ్యక్షులు చక్రపాణి, భాగ్యలక్ష్మి, సాయిలు, కార్యదర్శులు హన్మాండ్లు, అనిత, కవితా, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణహితంగా పండుగలు జరుపుకోవాలి

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** రానున్న దసరా, దీపావళి పండుగలు పర్యావరణహితంగా జరుపుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోనాపూర్ హెచ్‌ఎం రాంప్రసాద్ సూచించారు. ఈ మేరకు పాఠశాలలో శనివారం తల్లిదండ్రులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెలవుల్లో బతుకమ్మ కోసం వివిధ రకాల పూలు, ఆకులు సేకరించినప్పుడు వాటి శాస్త్రీయ నామాలు కూడా ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఆల్బమ్ తయారు చేయాలని, వర్షాకాలం కావడంతో కుంటలు, చెరువులు వాగుల దగ్గరకు వెళ్లినప్పుడు ఇతర పర్యవేక్షణలో మాత్రమే వెళ్లాలని, మైనర్ బాలురు వాహనాలు నడపవద్దని తెలిపారు. సెలవుల తర్వాత పరీక్షలు ఉండడంతో పదోతరగతి విద్యార్థులు కనీ సం మూడు గంటలు, మిగతా తరగతుల విద్యార్థులు కనీసం ఒక గంట పాటు చదువుకునే విధంగా చూడాలని తల్లిదండ్రులకు తెలిపారు. ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన రాంప్రసాద్‌ను ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సన్మానించారు.



## టోర్నీకి రావాలని ఏసీపీకి ఆహ్వానం

**అక్షరటుడే, బాల్కొండ:** ముప్కాల్ మండలంలో అంతర్‌జిల్లా బాలబాలికల కబడ్డీ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నారు. ఇందుకోసం కబడ్డీ టోర్నీ నిర్వాహకులు, గ్రామస్థులు శనివారం ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డిని కలిశారు. టోర్నీకి రావాలని ఆహ్వానించారు. కబడ్డీ క్రీడంటే తనకెంతో ఇష్టమని.. తప్పనిసరిగా వస్తానని ఏసీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీధర్ రెడ్డి, ఎస్సై రజనీకాంత్, కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధి కె.గంగాధర్, టి.సాయన్న, గంగారెడ్డి, శ్రీనివాస్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## టీపీసీసీ చీఫ్‌ను కలిసిన రాష్ట్ర మాజీ కార్యదర్శి




**అక్షరటుడే, బాన్సువాడ:** టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను టీపీసీసీ రాష్ట్ర మాజీ కార్యదర్శి అబ్దుల్ అహ్మద్ సన్మానించారు. ఈ సందర్భంగా శనివారం గాంధీభవన్‌లో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అబ్దుల్ అహ్మద్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం చేయడంలోనూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను ప్రజలకు అందించే దిశగా మహేష్‌కుమార్ గౌడ్ విజయవంతంగా ముందుకు సాగుతున్నారన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని బాన్సువాడ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశానని అబ్దుల్ అహ్మద్ తెలిపారు.




## ఆయుష్ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన

**అక్షరటుడే, ఇందూరు:** తెలంగాణ ఆయూష్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో యోగాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా నగరంలోని శంకర్ భవన్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆయుష్ విభాగం ఇన్‌ఛార్జి డాక్టర్ గంగాదాస్ మాట్లాడుతూ యోగా దైనందిన జీవితంలో భాగం కావాలన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేసినట్లయితే ఎలాంటి రోగాలు దరిచేరవని సూచించారు. అలాగే యోగాకు సంబంధించి వైద్యుడు తిరుపతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. శంకర్‌భవన్ హెడ్‌మాస్టర్ రామ్‌చందర్ గైక్వాడ్ మాట్లాడుతూ.. యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఆయుష్ విభాగం ఫార్మసిస్ట్‌లు పురుషోత్తం, ఉమాప్రసాద్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## కళా ఉత్సవ్‌లోబాల్కొండ జెడ్పీహెచ్ఎస్ ప్రతిభ




**అక్షరటుడే, బాల్కొండ :** జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో బాల్కొండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారని ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. ఈ మేరకు శనివారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. పదో తరగతి విద్యార్థిని సాయిశివాని వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి వేషధారణలో ఏకపాత్రాభినయం వేసి జిల్లా స్థాయిలో మూడో స్థానంలో నిలిచారు. అలాగే పాటల విభాగంలో కశ్మీర్‌పై విద్యార్థులు రిష్మా సుబుర్ ఆఫీజాఖానం, మహేక్ కౌసర్, ఆయేషా ఖానం కలిసి పాట పాడి మూడోస్థానాన్ని కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ప్రశాంత్‌కుమార్, గైడ్ టీచర్ కవితా రాణి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కామారెడ్డిలోని సాందీపని కళాశాలలో..



బోధన్‌లోని ఇందూర్ స్కూల్‌లో..



చంద్రాయన్‌పల్లిలో..



బోర్గాం(పి) పాఠశాలలో..



బాన్సువాడ మండలం దేశాయిపేటలో..